క్లుప్తంగా

విద్యాసామగ్రి, కుర్చీల పంపిణీ



విద్యార్థులు సామగ్రి అందజేస్తున్న ఆవోపా వైస్ ప్రెసిడెంట్

ఆళ్లగడ్డ: మండలంలోని బత్తలూరు ప్రాథమిక, స్పెషల్ స్కూల్లో చదువుతున్న 100 మంది విద్యార్థులకు విద్యా సామగ్రితో పాటు కుర్చీలను ఆవోపా ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ నాగేంద్రప్రసాద్ జ్ఞాపకార్థం రూ.7వేల విలువ గల విద్యా సామగ్రి, 3వేల విలువ గల కుర్చీలను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగంపై విద్యార్థులకు అవగాహన



పారిశ్రామిక విజిట్‌లో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజు

ఆళ్లగడ్డ: విద్యార్థి దశ నుంచే పారిశ్రామిక రంగంపై అవగాహన కలిగి ఉండాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజు సూచించారు. మంగళవారం కోటకుందుకూరులోని ఏపీ మోడల్ స్కూల్లో 9, 10, ఇంటర్ విద్యార్థులకు పారిశ్రామిక పర్యటన కార్యక్రమాన్ని ఆళ్లగడ్డలోని ప్రజ్ఞా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పర్యటనలో పారిశ్రామిక రంగం గురించి విద్యార్థులకు వివరించారు. కంప్యూటర్ మరియు ఇతర సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి అనేక విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్, ప్రజ్ఞ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శివరామిరెడ్డి, ఒకేషనల్ టీచర్స్ ప్రతాప్, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అతిసారంపై ప్రజలకు అవగాహన కల్పించండి



ఎస్సీ కాలనీలో మహిళకు అవగాహన కల్పిస్తున్న డీపీఓ

రుద్రవరం: అతిసారం పట్ల ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, అలాగే వారు దాని బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని డీపీఓ జమీనుల్లా మేజర్ పంచాయతీ ఈఓ సుబ్బారావుకు సూచించారు. మండల కేంద్రమైన రుద్రవరంలోని చంద్రునిపేట, ఎస్సీ కాలనీలో మూడు రోజులుగా అతిసార కేసులు పెరుగుతుండటంతో డీపీఓ మంగళవారం రాత్రి ఆ ప్రాంతాల్లో పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి నీటిని వేడి చేసి తాగాలన్నారు. అలాగే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని, తాగు నీటిని క్లోరినేషన్ చేయించాలని సిబ్బందికి ఆదేశించారు. మొత్తం 8 మంది అతిసారం బారిన పడ్డారని వారిలో 5 గురు కోలుకున్నారని మిగిలిన ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కండి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు

నంద్యాల(న్యూటౌన్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు అన్నారు. మంగళవారం నంద్యాల జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన పై నాయకులు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. విశాఖ ఉక్కును పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు పోరాటం చేయాలన్నారు. విద్యుత్ చార్జీల పెంపు తగదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలన్నారు. టీడీపీ ప్రభుత్వం ఎన్నికల్లో మాయమాటలు చెప్పి గద్దె ఎక్కిందన్నారు. రైతులు విద్యార్థులకు, మహిళలకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. నవంబర్ 18వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, ధనుంజయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకన్న, సోమన్న, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అపార్‌మైన ప్రయోజనాలు!

- వన్ నేషన్ – వన్ స్టూడెంట్ ఐడీ నినాదం
- విద్యార్థి జాతకమంతా ఒకే కార్డులో
- దేశంలో ఎక్కడైనా సులభంగా చదువుకునే అవకాశం
- జిల్లాలో 3.21లక్షల మంది విద్యార్థులు



పాఠశాల విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులకు సరికొత్త గుర్తింపు కార్డులు సిద్ధమవుతున్నాయి. జాతీయ విద్యావిధానం అమల్లో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ వన్‌నేషన్ వన్‌స్టూడెంట్ అనే నినాదంతో కేజీ టు పీజీ వరకు చదివే విద్యార్థులకు 12 అంకెలతో కూడిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) కార్డులివ్వనుంది. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయడంతో ఆ దిశగా చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి

విద్యార్థి పురోగతి తెలుసుకునేలా...

ఎప్పటికప్పుడు విద్యార్థుల అకడమిక్ పురోగతిని తెలుసుకోవడానికి, విద్యను మరింత సమర్థంగా నిర్వహించడానికి అపార్ ఐడీ ఉపకరించనుంది. డిజిటలైజేషన్, పర్సనలైజ్డ్ లెర్నింగ్, బడి బయట లేదా చదువుకు దూరంగా ఉన్న విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం తద్వారా విద్యను సార్వత్రికం చేయడం అపార్ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ప్రతి విద్యార్థి ఆయా విద్యా సంస్థల్లో సాధించిన విజయాలు, అతడి అకడమిక్ హిస్టరీ, డిజిలాకర్ ఇంటిగ్రేషన్ ద్వారా తీసుకున్న కోర్సులు, గ్రేడ్లు, సర్టిఫికేషన్లు.. ఇలా ప్రతి విషయాన్ని శాశ్వతంగా రికార్డు చేయడానికి అపార్ ఐడీ ఉపకరిస్తుంది. దీని ద్వారా విద్యార్థులు వారి అకడమిక్ రికార్డులను ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా యాక్సెస్ చేసుకోవచ్చు. అలాగే విద్యా సంస్థల మధ్య సులభతరంగా బదిలీ చేసుకునే వీలుంటుంది. ఉద్యోగాలు, ఉన్నత చదువులకు దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థుల అకడమిక్ రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యే వీలుంటుంది.

జిల్లాలో పరిస్థితి ఇది..

ప్రతి విద్యార్థికి జిల్లాలో అపార్ ఐడీని అందించేందుకు విద్యాశాఖ అడుగులు వేస్తోంది. జిల్లాలో ఉన్న 2,224 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పరిధిలో చదువుతున్న 3.21 లక్షల మంది విద్యార్థులకు అపార్ ఐడీని ఆయా విద్యా సంస్థల ద్వారా క్రియేట్ చేయనున్నారు. ఇందుకుగాను ముందుగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించాల్సి ఉంది. అనంతరం ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. ఇందుకోసం ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు/ సంరక్షకుల అనుమతి పత్రాలను సిద్ధం చేసుకుని, అనంతరం ప్రతి విద్యార్థికి అపార్ ఐడీని క్రియేట్ చేయనున్నారు.



అపార్ ఐడీ లోగో

తల్లిదండ్రుల అనుమతి తప్పని సరి..

విద్యార్థుల ఆకాడమిక్ డేటా భద్రంగా ఉంచేందుకు, గోప్యత పాటించేందుకు అవసరమైన చర్యలు కూడా తీసుకుంటున్నారు. అపార్ ఐడీ వివరాలను అధీకృత వినియోగదారుల ద్వారా మాత్రమే అందుబాటులో ఉండేలా భద్రతా చర్యలను తీసుకుంటారు. అపార్ ఐడీ జనరేషన్‌కు తల్లిదండ్రులు/సంరక్షకుల సమ్మతి అవసరం. 18 ఏళ్ల లోపు విద్యార్థులు మైనర్లు అయినందున తల్లిదండ్రులు/సంరక్షకుల అనుమతితోనే అపార్ ఐడీని క్రియేట్ చేస్తారు. అపార్ ఐడీ జనరేట్ చేసేందుకు తల్లిదండ్రులు ఇచ్చిన అంగీకార పత్రాన్ని పాఠశాలలో భద్ర పరుస్తారు. ఆధార్ నంబరు ఆధారంగా ఈ ఐడీని క్రియేట్ చేస్తారు. అందువలన ప్రతి విద్యార్థికి ఆధార్ నంబరు తప్పనిసరి. అపార్ ఐడీ ద్వారా విద్యార్థి సాధించే విజయాలు, అకడమిక్ ఫలితాలు, అభ్యసన స్థాయి తదితర సమాచారాన్ని ఒక్క క్లిక్‌తో తెలుసుకునే వీలుంటుంది.

తొలుత అవగాహన



ఆధార్ నంబరు మాదిరి గానే ప్రతి విద్యార్థికి అపార్ ఐడీని కేటాయించాల్సింది ఉంది. తొలుత అపార్ ఐడీపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పిస్తాం. విద్యార్థుల తల్లితండ్రులు/సంరక్షకుల నుంచి వారి అంగీకార పత్రాలను తీసుకున్న తర్వాత అపార్ ఐడీలు క్రియేట్ చేసేందుకు చర్యలు చేపడతాం. కేంద్రం తీసుకొచ్చిన ఈ విధానం విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

–జనార్దన్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

చిన్నారుల్లో గురకను నిర్లక్ష్యం చేయరాదు



డాక్టర్ మణిదీప్‌ను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): చిన్నపిల్లల్లో గురక నిర్లక్ష్యం చేయరాదని ప్రముఖ ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ చిత్తలూరి మణిదీప్ పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో స్థానిక మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో నిరంతర వైద్య విద్య సదస్సు నిర్వహించారు. ఇందులో చిన్నారుల గురకకు సంబంధించి అపోహలు, వాస్తవాలపై వైద్యులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముక్కు వెనుక భాగంలో అడినాయిడ్స్ పరిమాణం పెరిగి అది పని చేసే శక్తి కోల్పోయినప్పుడు తరచూ వాటికి ఇన్‌ఫెక్షన్ సోకి జలుబు వంటి శ్వాస ఇబ్బందులు వస్తాయన్నారు. దీనిని శస్త్ర చికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. పట్టణ ఐఎంఏ అధ్యక్షుడు మధుసూదనరావు, డాక్టర్ రవికృష్ణ, ఫణిల్ కుమార్, విజయభాస్కరరెడ్డి, వసుధా, గెలివిసహదేవుడు, నాగమణి, నర్మద తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి కార్తీక ఉత్సవాలు

బండిఆత్మకూరు: నల్లమల అటవీ ప్రాంతంలోని గంగా ఉమా సమేత ఓంకారం పుణ్యక్షేత్రంలో నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కార్తీక ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ నాగ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కార్తీక ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం తెల్లవారుజామున 4.30 నుంచి 9.30 వరకు అభిషేకాలు, ప్రతి సోమవారం గంగా ఉమా సమేత ఓంకారేశ్వరుడికి సుప్రభాత సేవ నిర్వహిస్తామన్నారు.

బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పని సరి



బాణాసంచా నిర్వాహకులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్

దొర్నిపాడు: బాణాసంచా స్టాళ్ల ఏర్పాటుకు తప్పనిసరిగా నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని తహసీల్దార్ సుభద్ర మంగళవారం సూచించారు. లేదంటే నిర్వాహకులపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాణాసంచా విక్రయించేప్పుడు ఎలాంటి అగ్నిప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. చిన్నపిల్లలకు వస్తే టపాసులు ఇవ్వరాదని పెద్దలకు వాటి వినియోగం గురించి వివరించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవ్, జూనియర్ అసిస్టెంట్ గోవిందు పాల్గొన్నారు.

దొర్నిపాడు: వ్యాపారులు అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటేష్ హెచ్చరించారు. చాలా మంది ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే బాణాసంచాను ఇళ్లలో నిల్వ ఉంచుకున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ప్రతి వ్యాపారి ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు.

బాణసంచా విక్రయ అనుమతులపై వాగ్వాదం

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో విక్రయ దుకాణాల ఏర్పాటు అనుమతులపై దుకాణ దారులు, అధికారుల మధ్య మంగళవారం సాయంత్రం వాగ్వాదం చోటు చేసుకుంది. గతేడాది పెండింగ్ అద్దెలతో పాటు ప్రస్తుత బాడుగ మొత్తం చెల్లిస్తేనే దుకాణాల కేటాయింపు ఉంటుందని అధికారులు ప్రకటించారు. దీనిపై వ్యాపారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ బకాయిల విషయాన్ని పక్కన పెట్టాలని ప్రస్తుత అద్దె మాత్రమే తాము చెల్లిస్తామని చెప్పారు. దీనికి అధికారులు అంగీకరించకపోవడంతో ఇరువురి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

ముస్లిపల్ ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత

- పాలకొమ్మ చెట్టు స్థలంపై వాడీవేడిగా చర్చ
- వార్డుల్లోని సమస్యలపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలి
- మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా



కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపాలిటీకి చెందిన ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. మంగళవారం ఆమె ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ముందుగా అజెండాలోని అంశాలన్నింటినీ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని మున్సిపల్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డిని ఆదేశించారు. ప్రతి స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించాలన్నారు. గత కౌన్సిల్‌లో ఎన్జీఓ కాలనీకి దక్షిణాన ఉన్న లలితా నగర్‌లో ప్రతిపాదిత 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డును 30 అడుగులకు కుదించాలని కౌన్సిల్ ముందు ఉంచారు.

పాలకొమ్మ చెట్టు స్థలాన్ని కాపాడండి

పట్టణంలోని పాలకొమ్మ చెట్టు స్థలాన్ని పరిరక్షించాలని కౌన్సిలర్లు కలాంబాషా, సాధిక్‌బాషా కోరారు. పట్టణంలో చాలా ప్రభుత్వ ఆస్తుల్లో అక్రమ కట్టడాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా పాలకొమ్మ చెట్టు స్థలంలో అక్రమ కట్టడాలు తొలగింపునకు కోర్టులో కౌంటర్ ఫైల్ దాఖలు చేసి పాలకొమ్మకు పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. అయితే ఆ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పట్టణ ప్రణాళిక అధికారులు నరసింహమూర్తి వెల్లడించారు. పలువురు సభ్యులు పట్టణంలో దోమలు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. దోమల నియంత్రణకు కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదన్నారు.

కాంపాక్టర్లు ఎందుకు పనిచేయడం లేదు

మూడు నెలలుగా నంద్యాల పట్టణంలో కాంపాక్టర్లు పని చేయకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడ గుట్టలుగా పేరుకుపోతుందని కౌన్సిలర్, మాజీ చైర్‌పర్సన్ దేశం సులోచన అన్నారు . 18వ వార్డులో ఈ సమస్య ఎక్కువగా ఉందన్నారు. చెత్తను డంప్ చేస్తుండటంతో రోగాలు వస్తున్నాయని ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. రూ.70లక్షలతో తెచ్చిన రెండు కాంపాక్టర్లు, ట్రాక్టర్లు రిపేరీ చేయించలేని దుస్థితిలో మున్సిపాలిటీ ఉందా అని ప్రశ్నించారు. ఇందుకు స్పందించిన మున్సిపల్ డీఈఈ రసూల్ మాట్లాడుతూ వాటికి సంబంధించిన బిల్లులు కంపెనీకి సిఫారసు చేశామని త్వరలోనే వాటిని సరి చేయిస్తామన్నారు.

ఆధ్యాత్మికం

ప్రజాస్వామ్యానికి ఆద్యుడు దశరథుడు



ప్రవచనాలు వినిపిస్తున్న ఉపన్యాసకులు

దొర్నిపాడు: ప్రజాస్వామ్యానికి దశరథ మహారాజు ఆద్యుడు లాంటివారని తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహులు మల్లువెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని భాగ్యనగరం గ్రామలో టీటీడీ ధార్మిక కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రామాయణం ఉన్నంత వరకు జగమంతా ఆదర్శమంతమైన జీవన మార్గాన్ని అవలంభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఉపన్యాసకులు రామసుబ్బారెడ్డి ప్రవచనాలను వినిపించారు. ఆలయన ధర్మకర్త వీరగంధం బ్రహ్మయ్య, గోపాల క్రిష్ణ, నరసింహ, వేణుగోపాల్‌రెడ్డి, బాషా, టీటీడీ ధర్మ ప్రచార మండలి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా గంధాభిషేకం

మహానంది: మహానందిలో నందీశ్వరస్వామికి మంగళవారం అభిషేకార్చనలు నిర్వహించారు. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో స్వామికి పాలాభిషేకం, గంధాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో పూజలు చేశారు. అనంతరం నందీశ్వరుడిని అలంకరించి మహా మంగళ హారతులిచ్చారు.

ఘనంగా శ్రీసత్యమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



కలశపూజ నిర్వహిస్తున్న వేద పండితులు

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రి ఖిల్లగడ్డ వీధిలో గ్రామ దేవత శ్రీసత్యమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా సాగుతోంది. ఉత్సవాల్లో రెండవ రోజైన మంగళవారం వేద పండితులు శ్రీనివాసశర్మ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశ స్థాపన, నవగ్రహ పూజ, రక్షాబంధనం, జలాధివాసం, గణపతి హోమం, రుద్ర, దుర్గా, నవగ్రహ హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహామంగళహారతి ఇచ్చి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ధన్వంతరి జయంతి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ సీతారామ లక్ష్మణ త్యాగరాజ స్వామి దేవస్థానంలో నాయీబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి వేడుకలు నిర్వహించారు. ధన్వంతరి ఉత్సవ మూర్తికి అభిషేకం, అర్చనలు చేసి హోమం నిర్వహించారు. అనంతరం ఆయుష్ శాఖ ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో డాక్టర్ యశోధర సుబ్రమణ్యేశ్వర స్వామి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఊడుమాల్పురం మల్లుగాళ్ల సుబ్బరాయుడు, సుబ్రమణ్యం, నాగపుల్లయ్య, పుల్లయ్య, పాల్గొన్నారు.

మంత్రిగారూ.. న్యాయంగా పనిచేయండి

నంద్యాల(రూరల్): రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌పై అధికార పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. నియోజకవర్గంలో ఏ పని చేసినా న్యాయంగా ఉండాలని..అన్యాయంగా చేయవద్దని చెప్పారు. జిల్లా కేంద్రంలోని తన స్వగృహంలో భూమా బ్రహ్మానందారెడ్డి పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని..అయితే, ఆ పేరుతో పట్టణంలోని నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద జీవిస్తున్న నిరుపేదలు నివాసాలను తొలగించడం బాధాకరమన్నారు. ఐదేళ్లు తెలుగుదేశం బలోపేతం కోసం పనిచేసిన పార్టీ కార్యకర్తలకు విలువ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్, మాబువలి, మాజీ కౌన్సిలర్ మంచాల విజయభాస్కర్‌రెడ్డి, వినయ్‌కుమర్‌రెడ్డి, నసీరబేగం, వార్డు టీడీపీ ఇన్‌చార్జ్‌లు, గ్రామ స్థాయి నాయకులు 50 మందికి పైగా పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ యూనియన్ కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన ఆటో కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్ బాబు మాట్లాడుతూ ఆటో కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సంక్షేమ బోర్డు లేక ఆర్థిక అసమానతలతో జీవనం గడుపుతున్నారన్నారు. ప్రమాద వశాత్తు మరణిస్తే బీమా కింద రూ.15లక్షలు, సహజ మరణానికి రూ.10లక్షలు కల్పించాలన్నారు. ఆటో నగర్ ఏర్పాటు చేసి కార్మికులకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. 55 సంవత్సరాలు దాటిన ఆటో కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షులు భూమన శ్రీనివాసులు, శీను, జగదీశ్వరరెడ్డి, నరసింహ, సామేలు, సిద్దిక్, ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఫారూక్ ఆత్మహత్యకు కాల్‌మనీ వేధింపులే కారణం

నంద్యాల(అర్బన్): జిల్లాలో కాల్‌మనీ వేధింపులు అధికమయ్యాయని, పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ ఫారూక్ ఆత్మహత్యకు అదే కారణమని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనిస్ అన్నారు. స్థానిక కార్యాలయంలో సమితి నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న ఫారూక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. బాధ్యులైన వారికి శిక్ష పడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గులాబ్‌బాషా, ఖాజాబాబా, సయ్యద్ మాలీ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు



ఆర్.జంబులదిన్నె గ్రామసభలో మాట్లాడుతున్న తహశీల్దార్



చాగలమర్రి మండలం ముత్యాలపాడులో..

ఉయ్యాలవాడ : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోందని తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామంలో గతంలో 430 మంది రైతులకు సంబంధించి 1601.40 ఎకరాల్లో రీసర్వే చేయడం జరిగిందన్నారు. రీ సర్వేలో తప్పులు జరిగాయని సరిదిద్దాలంటూ గ్రామానికి చెందిన 27 మంది దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్‌ఓ లక్ష్మీచెన్నప్ప పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి

గోస్పాడు: భూ రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల ఆర్‌డీఓ విశ్వనాథ్ అన్నారు. మండల పరిధిలోని రాయపాడు గ్రామంలో మంగళవారం తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో 9 మంది భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. అనంతరం ఆర్‌డీఓ మాట్లాడుతూ గత ప్రభుత్వం పాలాల్లో రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించిందని తెలిపారు. అందులో విస్తీర్ణం ఎక్కువ తక్కువ, మ్యూటేషన్, పేరు తప్పులకు, విభజన తదితర సమస్యలకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. నేడు ఎస్.నాగులవరం గ్రామంలో గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మోహన్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శ్రీరంగాపురంలో 141 దరఖాస్తులు

రుద్రవరం: మండల పరిధిలోని శ్రీరంగాపురంలో మంగళవారం రెవెన్యూ అధికారులు నిర్వహించిన గ్రామ సభలో రైతుల నుంచి 141 దరఖాస్తులు అందినట్లు తహసీల్దారు మల్లికార్జునరావు తెలిపారు. విస్తీర్ణం తేడాలపై 70, జాయింట్ ఎల్‌పీఎం కింద 31, సర్వేనంబర్ల తేడాల్లో 5, ఎల్‌పీఎం హద్దుల మార్పుల కోసం 70, కోర్టు కేసు కింద 1, మ్యూటేషన్ కోసం 34 దరఖాస్తులు అందినట్లు ఆయన తెలిపారు. వచ్చిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేసి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

భూ రీ సర్వేపై రెవెన్యూ సభ

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామ సచివాలయంలో మండల సర్వేయర్ మద్దిలేటి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

సో్పర్ట్స్

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



రాణించిన నంద్యాల క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ చెస్ పోటీల్లో 19 సంవత్సరాల బాలుర విభాగంలో ఆళ్లగడ్డకు చెందిన యుగంధర్ నాలుగో స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నంద్యాల జిల్లా చెస్ సంఘం అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రవికృష్ణ, రామసుబ్బారెడ్డి తెలిపారు. బాపట్లలో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో 17 సంవత్సరాల్లోపు బాలుర విభాగంలో నంద్యాలకు చెందిన హర్షవర్ధన్‌చారి మూడవ స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన ఈ ఇద్దరు క్రీడాకారులను చెస్ అసోసియేషన్ నాయకులు మంగళవారం అభినందించారు.

రైతు నేస్తం

సమగ్ర సస్య రక్షణతో అధిక దిగుబడులు



డి.కొత్తపల్లె గ్రామంలో పొగాకు పంటను పరిశీలిస్తున్న ఏఓ రంగ నేతాజీ

చాగలమర్రి: పంటల్లో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ రంగనేతాజీ రైతులకు సూచించారు. మంగళవారం డి.కొత్తపల్లె, కొలుములపేట గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. పొగాకు, మినుము, ఉల్లి పంటలను పరిశీలించి వాటిలో చేపట్టవలసిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. గత వారం రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు ఉల్లి పంటలో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉందన్నారు. ఈ తెగుళ్ల నివారణకు పురుగు మందులపై మాత్రమే ఆధారపడకుండా ట్రైకోడెర్మ విరిడి, సుడోమోనస్ కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. మినుములో రసం పీల్చే పురుగులు ఆశించే అవకాశం ఉందని వీటి నివారణకు పసుపు రంగు జిగురు అట్టలు పొలంలో 15 నుంచి 20 వరకు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మట్టిరోడ్డుగా మారిన తారురోడ్డు



దెబ్బతిన్న రహదారి

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం–పి.చింతకుంట గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి గుంతల మయమైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, అధికబరువుతో వెళ్తున్న సిమెంట్ లారీల కారణంగా రహదారి పూర్తిగా దెబ్బతినింది. తారు రోడ్డు కాస్త మట్టి రోడ్డుగా మారడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అడుగడుగునా గుంతలు ఉండటంతో వాహనాల రాకపోకలకు సమస్యగా మారింది. కనీసం గుంతలకు అతుకులైనా వేయాలని స్థానికులు కోరుతున్నారు.